# మా రఘురాముడి పెళ్లి సమస్య

**వా**డు చాలా యిరుకున పడ్డాడని చెప్పటానికి నాకు చాలా విచారంగా ఉంది. కుర్రాడు అందంగా ఉంటాడు. ఇంత చదువూ ఉంది. అన్న వస్త్రాలకు లోటులేదు. ఆ కారణం చేత ఎంతోమంది వాడికి పిల్లనిస్తామని వస్తున్నారు.

వీడి పెళ్లి ఓటి జరిగితే, ఏ నాలుగు వేలయినా కట్నం చేతిలో పడితే అది పెట్టి ఆ జంఝాలవారు అమ్మజూపుతున్న రెండూ చిల్లర చెక్కా కొని పారేద్దామని చూస్తున్నాడు వాడి తండ్రి. కలిసే భూమిలెండి.

సాటివాళ్లంతా కోడళ్లతో తగూలాడుతుంటే తనకాపాటి భాగ్యం లేకపోయెనే అని దిగులు పడుతున్నది వాడి తల్లి. ఎంతసేపూ ఆవిడకు ఒకటే వాదన : బ్రహ్మచారి ముదిరిగా బెండకాయ ముదిరినా ఏమీ లాభంలేదని.

వాడి అక్కచెల్లెళ్లు కూడా వాడి పెళ్లి కోసం తెగ ఎదురు చూస్తున్నారు. కాసులు మొహాన అద్దించుకోవటమూ, వెండి పుల్లతో పళ్లు తోమించుకోవటమూ – ఆటే ఆరోగ్యంకాదు మరి – ఇటువంటి ముచ్చట్లు వారికింకా తీరలేదు. మా రఘురాముడు తలిదండ్రుల కేక పుత్రుడూ, అక్కచెల్లెళ్ల కేక సోదరుడూనూ.

వాడికి పెళ్లాడాలని లేకపోయిం తరవాత ఇంతమందికీ ఉండి ఏం లాభం? పైగా వాళ్లు తనను కాకులు పొడిచినట్టు పొడుస్తుంటే సమాధానం చెప్పటానికి వీల్లేని స్థితిలో ఉన్నాడు.

అందుచేత వాణ్ని గురించి అపోహలు చాలా పుట్టినై. అసలు వీడు ఆడదాని ఊసే అవసరంలేని... ఆ రకమేమో అని కొందరు పబ్లీగ్గా శంకించినమాట అబద్ధం కాదు. వాడికి రహస్య ప్రేమ ఏదో ఉండి బాధిస్తున్నదని చాలామంది స్నేహితులనుమానించారు. వాడు నిద్రలో ఎవరో ఆడవాళ్ల పేర్లు ఉచ్ఛరించటం వల్ల వాడి తల్లికీ అటువంటి శంకే కలిగింది.

వాడి రహస్యం కనుక్కున్న ఒకరిద్దరిలో నేనొకణ్ని. అయితే నేను కూడా అసలు యదార్థం ఊహించలేకపోయినాను. నేననుకున్నదేమంటే వాడు సినిమాతారల వ్యామోహంలో పడి రాత్రింబగళ్లు వారిని గురించే కలవరిస్తున్నాడని. కలవరించటమేమిటో యదార్థమేగాని వాడు వాళ్ల వ్యామోహంలో పడ్డమాట అబద్ధం.

నిజమేమిటంటే – నమ్మండి, మానండి – సినిమా తారలే బతికున్న దయ్యాలై వాణ్ని పీక్కుతింటున్నారు! వాళ్లతో వాడు వేగలేకుండా ఉన్నాడు. మేలుకుని ఉన్నప్పుడు వాడికి వాళ్ల గొంతులు వినిపిస్తయి. వాళ్ల స్పర్శ తెలుస్తుంది. నిద్ర పోతున్నప్పుడు మనుష్యులే కనిపిస్తారు.

ఓరోజు వాడు నాతో మాట్లాడుతూనే కళ్లు గట్టిగా మూసుకుని చాలాసేపు తెరవలేక బాధపడ్డాడు. ఆఖరుకు, "పుష్పవల్లి" అని అప్పుడు కళ్లు తెరవగలిగాడు.

"పుష్పవల్లేమిట్రా?" అన్నాను. వాడు కొంచెం కంగారుపడి, "ఏమీ లేదులే... ఏమిటో చెబుతున్నావు?" అన్నాడు.

మరుక్షణమే వాడు బిగ్గిరిగా నవ్వుతూ, శరీరమంతా చీమలు పాకుతున్నట్టు అష్టవంకర్లూ తిరగసాగాడు.

నేను కొంచెం కంగారుగా, "ఏమిట్రా అదీ?" అన్నాను. వాడు నవ్వుతూ మాటకూడా అనలేకుండా! "ఆ పుష్పవల్లే!" అన్నాడు. కనీసం నా కట్లాగే వినిపించింది.

"ఒరే నీకు ఒంట్లో సరిగ్గా ఉన్నట్టులేదు. వైద్యుణ్ని పిలిపించనా?" అన్నాను.

వాడు చప్పున నవ్వటం మానేసి, "నీకేమైనా మతి పోయిందా ఏమిటి?" అన్నాడు. నేనావిషయం అప్పటికంతటితో పోనిచ్చాను.

అటు తరువాత కొద్ది రోజులకే మావాడు తన పేరుతో ఓ ప్రసిద్ధ సినిమా పత్రికకి ఈ విధంగా ప్రశ్న పంపాడు :

"నా స్నేహితుణ్ని సినిమాతారలు దయ్యాలై పట్టుకుని ఏడిపించుకు తింటున్నారు. నాకేం సలహా ఇస్తావు?"

"నన్ను సినిమాతారలు ప్రత్యక్షంగానే ఏడిపించుకు తింటున్నారు. నేనెవడితో చెప్పను?" అని సమాధానం వచ్చింది.

మా వాడి వ్యాధి – అది వ్యాధే అని గట్టి నమ్మకం – రాను రాను చాలా తీవ్రంగా పరిణమిస్తున్నది. అట్టే వివరాలివ్వటం నాకిష్టంలేదుగాని, ఈ సినిమాతారలు వాణ్ని చెప్పరాని విధాల విడిపించుకు తింటున్నారు. వాడు నలుగురిలోనూ కూర్చుని ఉండగా వాడి ఒళ్లో వచ్చి కూచుంటారు. వాణ్ని ముద్దులాడతారు. ఓ ప్రఖ్యాత సినిమా తార వాడి పెళ్లి ప్రయత్నాల గురించి తెలియకుండానే వాడికెదురుగా నిలబడి ఏడవసాగింది. వాడికో చెంప ఏడుపు వినిపిస్తూ ఉంటే మనం కారణం ఎట్లా?

ఇక వాడి కలల్లో సినిమాతారలు వాడికోసం ఒకరి జుట్టు ఒకరు పీక్కున్న సమయాలు కూడా ఉన్నై.

"నిన్ను ముఖ్యంగా బాధించే సినిమాతారలెవ"ని అడిగాను. వాడా చాలాపేర్లు

చెప్పాడు. అందులో కలకత్తా తారలూ, హిందీతారలూ, బొంబాయి తారలూ, ముస్లిం తారలూ కూడా ఉన్నారు.

"వాళ్ల భాష నీకెట్లా తెలుస్తుంది?" అన్నాను.

వాళ్లంతా వాడితో తెలుగే మాట్లాడతారుట. నయమే!

"ఇదంతా నీ భ్రమే అయి ఉంటుంది" అన్నాను.

మా వాడిక్కోపం వచ్చింది. "నాకు సినిమాతారలంటేఏమీ భ్రమలేదు. నేను వాళ్లని గడ్డిపోచలల్లే చూస్తాను. నేను వాళ్లతో వేగలేకుండా ఉన్నాను. కావలిస్తే వీళ్లందర్నీ నువ్వు పుచ్చుకో!" అన్నాను.

"వాళ్లు నీ మొహం చూసి నీ దగ్గిరికి రావద్దూ!" అన్నాడు.

అప్పుడు నాకు మరో సందేహం తట్టింది.

"వాళ్లు నీలో ఏం చూస్తున్నారో నాకు తెలియకుండా ఉంది. ప్రపంచంలో నీ కంటె అందగాళ్లూ, రసికులూ లేరా?" అన్నాను.

"ఉన్నారని మనం అనుకోగానే సరా ఏమిటి? ఉంటే వీళ్లంతా నన్నెందుకు బాధించటం?" అన్నాడు మావాడు. అదీ నిజమే మరీ.

చెప్పొచ్చిందేమంటే, మనదేశం ఇంకా గొడ్డు పోలేదు. దేశం నిండా భూతద్ర్యులూ, డాక్టర్లూ, నాటువైద్యులూ, హకీములూ, చిట్కా బౌరాగులూ, పంచదార మాత్రలవాళ్లూ ఉన్నారు. ఎవ్వైరనా మావాడి రోగం కనిపెట్టి చికిత్స చేస్తే మా అందరికీ మహోపకారం చేసిన వాళ్లవుతారు. జాగయితే ఆ జంఝూలవారి చెక్క మరోరు కొనేస్తారో ఏమిటో, అదికాక మావాడి పెద్దక్క "ఏడుగురు పిల్లల్ని కంటిని, ఇంతవరకూ వెండు పుడకతో పళ్లు తోమించుకున్న పాపాన పోకపోతిని" అంటున్నది. (అది నిజంగా పాపమే మరీ!) ఆవిణ్ని ఆ పంపాన పంపగలందులకైనా ఎవరో ఒకరు నా రఘురాముడి రోగం కుదిరిస్తే బాగుణ్ను!

***ముద్రణ : 1944?***

***ముద్రణ : కుటుంబరావు సాహిత్యం ఆరవ సంపుటం,***
***విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, డిసెంబర్ 1994***